
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.7 । కనిష్ఠం 18.3



నిజామాబాద్
జిల్లా వార్తలు
5
గురువారం 22 ఫిబ్రవరి 2024





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

నా జోలికి వస్తే కాంగ్రెస్ బండారం బయటపెడతా

- వైఎస్ ఎలా మరణించాడో కూడా నాకు తెలుసు
- ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 21: అసెంబ్లీ ఎన్నికల్లో తప్పుడు హామీలిచ్చి ప్రజలను తప్పుదోవపట్టించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలయ్యేలా కృషి చేయాలే తప్ప అనవసరంగా తన జోలికి వస్తే కాంగ్రెస్ బండారం బయటపెడ్తానని ఎంపీ అర్వింద్ అన్నారు. బుధవారం రూరల్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంపీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ చరిత్ర మొత్తం తెలుసు.. వైఎస్ ఎలా మరణించాడో కూడా తెలుసని ఎంపీ అరవింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పసుపు పంటకు మద్దతు ధర పెరగడాన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ పార్టీ వసుపు సాగు విస్తీర్ణం తగ్గింది కాబట్టి ధర పెరిగిందని తప్పుడు ప్రచారం చేస్తుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో బీఆర్ఎస్ లక్షలాది రూపాయలు వృథా చేసిందన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ హామీ క్రమేనా తగ్గుతూ వస్తోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 23 సీట్లు కూడా రావన్నారు. నిజామాబాద్‌లో తనపై పోటీచేసేందుకు విపక్షాలకు అభ్యర్థులు ముందుకు రావడం లేదని విమర్శించారు. కాగా, ఎంపీ అరవింద్‌కు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 2 లక్షల మెజార్టీ ఇచ్చి బీజేపీ సత్తా చూపాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పటేల్ అన్నారు.

సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి

ముప్కాల్, ఫిబ్రవరి 21: బీజేపీ తలపెట్టిన కొమురంభీం సంకల్ప యాత్ర ఈనెల 26న జగిత్యాలలో మొదలై 27న బాల్కొండ నియోజకవర్గానికి చేరనుందని ఈ యాత్రను విజయవంతం చేయాలని కార్యకర్తలకు ఎంపీ ధర్మపురి అర్వింద్ పిలుపునిచ్చారు. బుధవారం బాల్కొండలో ఏర్పాటు చేసిన కొమురంభీం సంకల్పయాత్ర సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల నుంచి స్పైస్ బోర్డుపై ఉద్యమం జరిగితే ఏర్పాటుకు ఏ నాయకుని తరం కాలేదన్నారు.. జాతీయ పసుపు బోర్డు తేవడం ఒక ఎత్తయితే ప్రధాని నరేంద్రమోదీ నిజామాబాద్‌లో ప్రకటించడం ఒక ఎత్తు అని ఆయన అన్నారు. పసుపుబోర్డు మూలంగా పసుపుకు రూ.13వేల మద్దతు ధరతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. పసుపు ధర పెరగడం వల్ల బీజేపీకి మంచి పేరు రావడం ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీ వాళ్లు తక్కువ విస్తీర్ణంలో పసుపు పండించడం వల్ల ధరలు పెరిగాయని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారి, పార్లమెంట్ కన్వీనర్ భూమన్న, జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.



జిల్లాలో పెరుగుతున్న రౌడీయిజం!

నగరంలో రౌడీయిజం చాపకింద నీరులా వ్యాప్తి చెందుతోంది. ఎప్పుడు, ఎక్కడ ఏమి జరుగుతుందో తెలుసుకోలేని పరిస్థితుల్లో ప్రజలు జీవనం సాగిస్తున్నారు. రౌడీయిజాన్ని గుర్తించేందుకు పోలీసు శాఖలో ఉన్న నిఘావిభాగం పూర్తిగా విఫలమవడంతో రౌడీమూకలు రెచ్చిపోతున్నారు. వరుస దాడులకు పాల్పడుతున్నారు. కత్తులతో పాటు తల్వార్‌లు, ఇతరత్రా మారణాయుధాలతో సంచరిస్తున్నారు. దీంతో చిన్న వివాదం తలెత్తినా కత్తులు, కర్రలతో దాడులకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా నగర శివారులోని పలు ప్రాంతాల్లో రాత్రివేళ పోలీసు నిఘా లేకపోవడంతో దాడులు పెరిగిపోతున్నాయి

- నగరంలో రెచ్చిపోతున్న రౌడీ మూకలు
- కత్తులు, కర్రలతో ప్రత్యర్థులపై దాడులు
- భూ కబ్జాలు, మత్తు పదార్థాల విక్రయాలు
- నగర శివారులోని పలు ప్రాంతాలే అడ్డాలు
- పోలీసులకు సవాల్‌గా మారుతున్న కేసులు

ఖిల్లా, ఫిబ్రవరి 21: జిల్లా కేంద్రంలో రౌడీమూకలు రెచ్చిపోతున్నారు. సివిల్ పంచాయితీలు నిర్వహిస్తూ పోలీసులకు సవాల్‌గా మారుతున్నారు. ఎదురు తిరిగిన వారిపై దాడులు చేస్తున్నారు. నగరంలో ఓ వర్గానికి చెందిన కొందరు యువకులు గ్రూపులుగా ఏర్పడి తమ ఉనికిని చాటుకోవడానికి అమాయకులపై దౌర్జన్యాలు చేస్తున్నారు. వీరి ఆగడాలు నగరంలో పెరిగిపోతున్నా.. పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో వారు రెచ్చిపోయి అడ్డూ అదుపులేకుండా దాడులకు పాల్పడుతున్నారు. నగరంలో వారం రోజుల కితం కామారెడ్డికి చెందిన ఫారూఖ్ అనే యువకుడిపై దాడులు చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన నగరంలోని మూడో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఫారూఖ్‌కు చెందిన ఓ గదిని ఖాళీ చేయాలని అందులో ఉండే సదరు వ్యక్తికి చెప్పాడు. అయితే ఎంతకూ గది ఖాళీ చేయకపోగా ఫారూఖ్‌పై సుపారీ ఇచ్చి మరీ దాడి చేయించాడు. ఫారూఖ్‌పై దాడి చేసిన వారు గతంలో అనేక నేర చరిత్ర కలిగిన వారు కావడం గమనార్హం. వారు ఓ రాజకీయ పార్టీకి చెందిన వారుగా చెలామని అవుతూ నేరాలకు పాల్పడుతున్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది. అదే గ్రూపునకు చెందిన కొందరు ఫారూఖ్‌పై దాడి చేయగా స్థానికులు రావడంతో ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. బాధితుడు మూడో టౌన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిపై గతంలో వివిధ పోలీసు స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయి. అయినా వారు యథేచ్ఛగా సివిల్ పంచాయితీలు నిర్వహిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వీరంతా ఓ రాజకీయ పార్టీకి చెందిన వారు ఉండడంతో పోలీసులు సైతం వారిపై కఠినంగా వ్యవహరించడానికి ముందుకు రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు పట్టించుకోక పోవడంతో వారు రెచ్చిపోయి భూకబ్జాలు, సివిల్ పంచాయితీలు నిర్వహిస్తూ దౌర్జన్యాలు చేస్తున్నట్లు సమాచారం. నగరంలోని శివారు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో క్యారం అడ్డాలు అనేకం నడుస్తున్నాయి. వాటిని నియంత్రించాల్సిన పోలీసులు రాత్రివేళ పెట్రోలింగ్ చేయకపోవడంతో క్యారం బోర్డు వద్ద గొడవలు, హత్యలు జరుగుతున్న ఘటనలు ఉన్నాయి. ఐదవ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో వారం రోజుల క్రితం రాత్రి క్యారం ఆడుతున్న వారిపై సమద్ అనే వ్యక్తి దాడిచేసి అక్కడ ఉన్న వారిని తీవ్రంగా గాయపరిచాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా సమద్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. సమద్‌పై వివిధ పోలీసు స్టేషన్లలో పలు కేసులు ఉన్నాయి. అయినా ఇలాంటి వారిపై పీడీయాక్ట్ నమోదు చేయకపోవడంతో నగరంలో రౌడీమూకలు రెచ్చిపోతున్నారు.

ఆరు నెలల్లో రెండు కేసులుంటే పీడీయాక్ట్ నమోదు..

: రాజావెంకట్‌రెడ్డి, నిజామాబాద్, ఏసీపీ

నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆరునెలల్లో రెండు కేసులు నమోదు అయిన వారిపై ఉన్న తాధికారుల సలహాలు తీసుకుని పీడీయాక్ట్ నమోదుకు ప్ర యత్నాలు చేస్తాం. ప్రజల సహకారంతో మెరుగైన పోలీసు సేవలు అందిస్తాం.

రద్దయిన పీడీయాక్ట్ కమిటీ

పోలీసుల రికార్డు ప్రకారం పలు నేరాలకు పాల్పడే వారిపై పీడీయాక్ట్ నమోదు చేసే అవకాశం ఉంటుంది. గతంలో పీడీయాక్ట్ నమోదు చేసే అవకాశాలు ఉన్నా పీడీయాక్ట్ కమిటీ రద్దు కావడంతో పోలీసులు పీడీయాక్ట్ నమోదు చేయడం లేదు. దీంతో నగరంలో కొందరు యథేచ్ఛగా నేరాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. గతంలో కొందరిపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని పోలీసు ఉన్నతాధికారులు చెప్పినప్పటికీ కమిటీ లేకపోవడంతో పీడీయాక్ట్ నమోదు చేయలేదు. ఒకటి కన్న ఎక్కువ కేసుల్లో ఉన్న వారిపై పీడీయాక్ట్ నమోదు చేయలేకపోవడంతో నగరంలో నేరాల సంఖ్య పెరిగిపోతున్నాయి. కొంతకాలం కితం జంగిల్ ఇబ్బు, ఆరీఫ్‌డాన్‌లు కత్తులతో పరస్పర దాడులు చేసుకుని మృతి చెందిన ఘటనలు జరిగాయి.

రోటీ కోసం హత్య

తాజాగా నగరంలోని చంద్రశేఖర్ కాలనీలో రోడ్డుపై విక్రయించే రోటీ కోసం జరిగిన వాగ్వాదంలో సోను అనే యువకుడు జలీల్ అనే మరో యువకుడిపై కత్తితో దాడి చేయగా ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ ఘటన జరిగిన రెండు రోజులకే ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో కిరాణా దుకాణం వద్ద ఉన్న గౌస్‌పాషా(బాబ)అనే వ్యక్తిని మరో యువకుడు అజయ్ కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో ఆ యువకుడు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటలను ప్రజలు మరువక ముందే నగరంలోని న్యాలకల్ రోడ్డు వద్ద గల ఓ వెంచర్‌లో శనివారం రాత్రిగుర్తు తెలియని వ్యక్తుల చేతిలో శ్రావణ్‌కుమార్ అనే కాంపౌండర్ హత్యకు గురయ్యాడు.

నేరాలకు అడ్డాగా శివారు ప్రాంతం

నగర శివారులోని పలు ప్రాంతాలు నేరాలకు అడ్డాగా మారాయి. పనిపాటలేని కొందరు యువకులు గంజాయి తాగుతూ, మత్తు పదార్థాలు అమ్ముతూ, బియ్యం అక్రమ రవాణా చేస్తూ నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో ఉన్నా వాటిని నియంత్రించడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొంతకాలం క్రితం జంగిల్ ఇబ్బు, ఆరీఫ్‌డాన్‌లు హత్యకు గురికావడంతో కొన్ని రోజులుగా కత్తుల సంస్కృతికి తెరవేశారు. తిరిగి కత్తులు, గన్‌లతో నగరంలో తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి.



ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎంసీహెచ్ కిట్ల కొరత

- అస్పత్రుల చుట్టూ తిరుగుతున్న బాలింతలు
- మూడేళ్లుగా జమకాని ప్రోత్సాహక డబ్బులు
- స్పష్టత ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం
- కేసీఆర్ కిట్‌ను.. మాతా శిశు ఆరోగ్య కిట్‌గా పేరు మార్పు

బోధన్ రూరల్, ఫిబ్రవరి 21: బోధన్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రులో మాతా శిశు ఆరోగ్య కిట్ల (ఎంసీహెచ్) కొరత ఏర్పడింది. దీంతో బాలింతలకు కిట్స్ ఇవకుండానే తిరిగి పంపిస్తున్నారు. ప్రభుత్వ అస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ పథకం అమలు మున్నాళ్ల ముచ్చటే అయింది. 2017లో ఈ పథకం ప్రారంభమైనప్పుడు కనిపించిన ఉత్సహం.. ఆ తర్వాత లేకుండా పోయింది.

మూడేళ్లుగా అందని ప్రోత్సాహకాలు

మూడేళ్లుగా గర్భిణుల బాలింతలకు ప్రోత్సాహక నగదు అందడం లేదు. జిల్లా వ్యాప్తంగా రూ కోట్లలో బకాయిలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం అయినా తమ బకాయిలను చెల్లిస్తుందన్న ఆశతో గర్భిణులు, బాలింతలు ఆశతో ఎదురుచుస్తున్నారు. కాగా, ప్రభుత్వ అస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య రెట్టింపు అయింది. కేసీఆర్ కిట్‌తో పాటు నగదు అందచేయడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన గర్భిణులు ప్రభుత్వ అస్పత్రుల వైపు మొగ్గుచూపారు. అంత వరకు బాగానే ఉన్నా ప్రోత్సాహకాలు మూడేళ్లుగా జమకావడం లేదు. దీంతో లబ్ధి దారుల బ్యాంకుల చూట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నాలుగు విడతలుగా..

కేసీఆర్ కిట్ పథకం కింద యాంటినేటల్ కేసీఆర్ చెకప్ పూర్తయిన తర్వత నగదు మొత్తన్ని విడతల వారీగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలి. గర్భిణి గా నిర్ధారణ అయి రెండు దఫాలుగా వై ద్య పరీక్షల తర్వాత మెదటి విడత రూ.3వేలు అందించాలి. ఐదు నెలలు నిండిన తర్వాత రెండో విడత ఎఎన్ సీ చెకప్ పూర్తయిన తర్వాత రూ. 2వేలు చెల్లించాలి. మూడో విడత పూర్తయిన తర్వాత ప్రసవం నాలు గో విడతగా ఒక వేళ ఆడబిడ్డ పుడితే రూ.5 వేలు మగ బిడ్డ పుడితే రూ.4 వేలు జమ కావాలి, మొత్తంగా ఆడపిల్ల అయితే రూ.13వేలు, మగబిడ్డ అయితే రూ 12 ఎఎసీ పూర్తయిన తర్వాత అందచేయాలి. కానీ మూడేళ్లుగా ఇదేది జరగడం లేదు.

కొత్త సర్కార్ అయినా..

పథకంపై సీఎం రేవంత్‌రెడ్డి వైద్య, ఆరోగ్య శాఖ సమీక్ష సమావేశంలో చర్చించినప్పటికీ తుది నిర్ణయం తీసుకోలేదు. కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. కొత్త ప్రభుత్వం ఈ పథకాన్ని కొన సాగిస్తుందా లేక పేరు మార్చి సరికొత్తగా అమలు చేస్తుందా అనేది తెలియాల్సి ఉంది.

జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు బాలింతలు, గర్భిణులకు కేసీఆర్ కిట్ పథకం కింద చెల్లించాల్సిన నగదు వివరాలను ఎప్పటికప్పుడు గత ప్రభుత్వానికి నివేదించుకుంటూ వచ్చారు. ఈ పథకం అమలుకు మొదట్లో చూపిన శ్రద్ధను తర్వాత చూపలేదు. ప్రచారార్భాటమే తప్ప పథకం ఫలాలు బాలింతలకు, గర్భిణులకు అందలేదన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ బాకాయిల విషయంలో కొత్త ప్రభుత్వం నిర్ణయం ఏమిటో ఇంకా స్పష్టం కాలేదు.

ప్రభుత్వానికి నివేదించాం..

: సుదర్శనం, డీఎంఅండ్‌హెచ్‌వో

జిల్లాలో మాతా శిశు ఆరోగ్య కిట్ల కొరతపై ప్రభుత్వానికి నివేదిక అందజేశాం. వచ్చే నెల 1వ తేదీ అనంతరం అన్ని ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంటాయి. బాలింతలకు సరిపడా మాతా శిశు ఆరోగ్య కిట్లు అందజేస్తాం.

ఎంసీహెచ్ కిట్, పౌష్టికాహార కిట్..

గర్భిణులను పోషకాహార లోపం రక్తహీనత నుంచి కాపాడెందుకు ప్రసవంతరం బాలింతలకు 16 రకాల వస్తువులతో కూడిన పోష్టికాహర కిట్ కూడా ఇచ్చేవారు. ఇప్పుడు అవి కూడా అయిపోవడానికి దగ్గర పడ్డాయి. బోధన్ ప్రభుత్వ ఆస్పత్రిలో 30 వరకు మాత్రమే ఉన్నాయి ఇవికూడా ఆయిపోతే గర్భిణులకు కిట్ల కొరత ఏర్పడనుంది. మాతా శిశు ఆరోగ్య కిట్లను కొత్త ప్రభుత్వం త్వరాగా అదించాలని గర్భిణులు, బాలింతలు కోరుతున్నారు.



కార్యక్రమంలో ట్రైనీ కానిస్టేబుళ్లు



మాట్లాడుతున్న సీపీ కల్మేశ్వర్

క్రమశిక్షణతోనే నేరాలను అరికట్టవచ్చు

- సీపీ కల్మేశ్వర్ శింగనేవార్

ఖిల్లా, ఫిబ్రవరి 21: నేటి సమాజంలో రకరకాల మోసాలను, నేరాలను అరికట్టాలంటే శిక్షణ పొందే సమయంలో సిబ్బంది క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేయాలని, అప్పుడే ఇలాంటి నేరాలను అరికట్టడం జరుగుతుందని పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌శింగనేవార్ అన్నారు. ఎడపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని జాన్కంపేట వద్ద గల పోలీసు శిక్షణ కేంద్రంలో బుధవారం నూతనంగా ఎంపికైన స్టయిఫాండరీ క్యాడెట్ ట్రైనీ కానిస్టేబుల్‌కు 9నెలల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. వివిధ జిల్లాల నుంచి వచ్చిన మొత్తం 195మంది పురుష అభ్యర్థులు ఎంపికయ్యారన్నారు. ఉన్నత చదువులు చదివి కూడా పోలీసు శాఖలో ప్రజలకు సేవ చేయడానికి ముందుకు రావడం సంతోషంగా ఉందని వారిని ప్రత్యేకంగా అభినందించారు. మీరు ప్రధానంగా సమాజానికి ఏమి చేయాలి అనేది ఆలోచించి విధులు ప్రారంభించాలన్నారు. సమాజంలో శాంతిభద్రతలు బాగుండాలన్న అభి వృద్ధి చెందాలన్న ముఖ్యంగా పోలీసు విధులు ప్రధానం అని తెలిపారు. ప్రజలందరు సుఖశాంతులతో ఉండాలంటే సిబ్బంది చక్కని విధులు నిర్వహించాలన్నారు. శిక్షణ ఇంటినిర్మాణానికి పునాదిలాంటిది, పునాది బాగుంటే ఇంటి నిర్మాణం బాగుంటుందని తెలిపారు. అందుకే పోలీసు శాఖపై ఎంతో బాధ్యత ఉంటుందని అన్నారు. సిబ్బంది ఒకే విధంగా ఆలోచించి సేవలు అందించాలన్నారు. అమలు చేసే చట్టం ఒకేలా ఉండాలని అందుకే క్రమశిక్షణ చాల ముఖ్యమని తెలిపారు. ప్రతి ఒక్కరు మంచి విశ్వాసంతో, ఉండాలని అన్నింటికి కట్టుబడి నియమ నిబద్ధతతో ఉండడం కూడా ప్రతీ ఒక్కరికి చాల అవసరమని, ఎవరు కూడా ఎటువంటి అపోహలు లేకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు (లాఅండ్‌ఆర్డర్)శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ ఎస్.జయరాం, వైస్ ప్రిన్సిపాల్ ఏసీపి. టీఎస్.శ్రావణ్‌కుమార్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, సీసీఆర్‌బి ట్రాఫిక్ ఏసీపీలు రాజావెంకట్‌రెడ్డి, బస్వారెడ్డి, పి.శ్రీనివాస్, ఏ.రవీందర్‌రెడ్డి, నారయణ, పోలీసు యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సరళ, రిజర్వు ఇన్స్‌పెక్టర్ కే.శ్రీనివాస్, రమేష్, తదితర సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనంను పోలీసు కమిషనర్ స్వీకరించారు.



ఎస్సారెస్పీ ఆయకట్టుకు నీటి విడుదల

- రెండు నెలల్లో 43 టీఎంసీల నీటి వినియోగం
- ప్రాజెక్టులో ప్రస్తుతం 35 టీఎంసీల నీటి నిల్వలు

నిజామాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్సారెస్పీలో ఆయకట్టుకు భారీగా నీటి వినియోగం అవుతుంది. సాగు విస్తీర్ణం పెరగడం ప్రాజెక్టు పరిధిలో 9లక్షల ఎకరాల వరకు సాగు అవడం వల్ల ఎక్కువ నీటిని వినియోగిస్తున్నారు. ఎల్‌ఎండీ ఎగువతో పాటు దిగువకు కూడా నీటిని విడుదల చేయడంతో రెండు నెలల్లో 43 టీఎంసీల నీటిని ఆయకట్టుకు వినియోగించారు. ప్రాజెక్టులో ఇంకా 35 టీఎంసీల నీళ్లే ఉండగా మరో 40 రోజులు పొదుపుగా ఆయకట్టుకు నీటిని అందించేందుకు నిర్ణయించారు. వరద కాలువకు నీటి విడుదలను నిలిపివేశారు. ఎల్‌ఎండీ పరిధి లోని రైతులు, ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న విజ్ఞప్తి మేరకు ఇక్కడ వేసిన పంటలను కాపాడేం దుకు సిద్ధమవుతున్నారు. కరెంటు కోతలు కూడా మొదలు కావడం వల్ల ఎక్కువ మంది రైతులు ఎస్సారెస్పీ నీటిపై ఆధారపడటంతో నీటి వినియోగం ఎక్కువ అవుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

డిసెంబర్ 19 వరకు నీటి విడుదల

ఎస్సారెస్పీ నుంచి యాసంగి ఆయకట్టుకు డిసెంబరు 19 నుంచి నీటి విడుదలను చేస్తున్నారు. ఎల్ ఎండీ ఎగువన కాకతీయ, సరస్వతి, లక్ష్మి, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డితో పాటు గుత్పఅలీసాగర్ ఎత్తిపోతల పథకాల కింద ఆయకట్టుకు సాగునీటిని అందిస్తున్నారు. వీటితో పాటు ఇతర ఎత్తిపోతల పథకాలకు కూడా నీటిని విడుదల చేస్తున్నారు. వరద కాలువల ద్వారా మిడ్‌మానేరుకు నీటి విడుదల కొనసాగించారు. ఈ యాసంగికి ఆయకట్టుకు నీటి విడుదల చేసే సమయంలో ఎస్సారెస్పీ ప్రాజెక్టులో 1088.60 అడుగుల నీళ్లు ఉండగా ప్రాజెక్టులో 78.342 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. రెండు నెలలు ఆయకట్టుకు నీటిని విడుదల చేసిన తర్వాత ప్రస్తుతం ప్రాజెక్టులో 1072.90 అడుగుల నీళ్లు ఉండగా ప్రాజెక్టులో 30.039 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో 35 టీఎంసీల నీరే ఉండటం వల్ల వచ్చే 40 రోజులు పొదుపుగా నీటి విడుదల చేసేందుకు అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న నీటి విడుదలలో 25 టీఎంసీల నీటిని మాత్రమే ఆయకట్టుకు వినియోగించనున్నారు. ప్రాజెక్టులో 10 టీఎంసీల నీటిని నిలువ ఉంచనున్నారు. తాగునీటితో పాటు డెడ్ స్టోరేజీకి నీటి నిలువలు అవసరం ఉండటం వల్ల అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. మిషన్ భగీరథ కింద నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాలకు నీటి సరఫరా కొనసాగిస్తున్నారు. తాగు నీటికి కూడా వినియోగిస్తుండటం వల్ల వేసవి పూర్తయ్యేంత వరకు 10 టీఎంసీల నీళ్లు ఉంటేనే సరిపోతుందని అధికారులు భావిస్తున్నారు. తాగునీటి అవసరాలకు నిలువ ఉంచి మిగతా నీటిని పంటలకు వినియోగించనున్నారు. ఆయకట్టులో భారీగా వరిసాగు చేయడం వల్ల నీటి వినియోగం ఎక్కువ అవుతున్నట్లు ఎస్సారెస్పీ అధికారులు తెలిపారు.

వేములవాడ రాజన్న సేవలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే

వేములవాడ ఫిబ్రవరి 21: వేములవాడ రాజరాజేశ్వర స్వామిని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కోడె మొక్కు చెల్లించుకొని స్వామివారి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం, ఆలయ సూపరింటెండెంట్ అల్లి శంకర్ స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు ఉన్నారు.



ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో నిజామాబాద్ క్రీడాకారులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 21: ఈనెల 21నుంచి 25వరకు పాట్నాలో జరుగుతున్న జూనియర్ జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో కళ్యాణ్‌రాజ్, అర్వింద్, మహేష్, బాలికల విభాగంలో ఇందూ, శ్రావిక, సాత్విక, సోనీలు పాల్గొననున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి తెలిపారు. అలాగే ఈనెల 21నుంచి 26వరకు న్యూఢిల్లీలో ఇందిరాగాంధీ స్టేడియంలో జరగనున్న 43వ సీనియర్, 30వ జూనియర్ ఆసియాట్రాక్, 12వ పారాసైక్లింగ్ చాంపియన్ పోటీలకు జిల్లాకు చెందిన రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి, జిల్లా కార్యదర్శి విజయ్ కాంత్‌రావ్ అఫిషియల్‌గా ఎంపికయ్యారు. ఆసియా ఖండం నుంచి 18దేశాల సైక్లిస్ట్ పాల్గొంటున్నా ఈ పోటీలకు అఫిషియల్‌గా విజయ్‌కాంత్ రావ్ ఎంపిక కావడం పట్ల రాష్ట్ర అధ్యక్షుడు మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కృపాకర్‌రెడ్డి, సూర్య ప్రకాష్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు కార్పొరేటర్లు

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 21: నగరానికి చెందిన ఇద్దరు బీఆర్ఎస్ కార్పోరేటర్లు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్సీటీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌ల సమక్షంలో అబ్దుల్ ఖుద్దూస్, శివచరణ్‌లు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తాహెర్‌బిన్‌హందాన్, గడుగు గంగాధర్, నగర అధ్యక్షుడు కేశవేణు, రత్నాకర్, ఫయామ్, దయాకర్ గౌడ్, నజీబ్‌అలీ, పప్పాఖాన్,రాజేశ్, మిస్బా తదితరులు ఉన్నారు.

వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిరంతరం చేయాలి

కోటగిరి, ఫిబ్రవరి 21: గ్రామాల్లో అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిరంతరం చేయాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ సూచించారు. కోటగిరి మండలంలోని ఎత్తొండ ఆరోగ్య ఉప కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. గర్భిణీలు, చిన్న పిల్లలకు ఇచ్చే టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. పిల్లలు, గర్భిణీల వివరాలు కలిగిన జాబితా తప్పకుండా అందుబాటులో ఉండాలని సూచించారు. టీకాల వివరాలను యూవీన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి గురువారం రక్తపోటు, మధుమేహంతో ఉన్న వారికి వయోవృద్ధులకు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సరోజ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఘనంగా ఎదురుగొండ వెంకన్న రథోత్సవం



ఎదురుగొండలో స్వామి రథాన్ని లాగుతున్నభక్తులు


సిరికొండ ఫిబ్రవరి 21 : మూడు జిల్లాల సరిహద్దులో ఎదురుగొండపై వెలిసిన శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి రథోత్సవం బుధవారం భక్తుల ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరిగింది. సిరికొండ మండలం తూంపల్లి శివారులో ఎదురుగొండపై కొలువు దీరిన శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి నిజామాబాద్, కామారెడ్డి, సిరిసిల్లా జిల్లాల సరిహద్దులో అడవీలో మూడురోజులుగా జాతర సాగుతోంది. బుధవారం ఉదయం స్వామివారి కల్యాణోత్సవం జరిగింది. సాయంత్రం రథోత్సవం అంగరంగ వైభవంగా, భక్తుల ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరిగింది. ఈ జాతరకు కామారెడ్డి, సిరిసిల్లా,నిజామాబాద్ జిల్లాలకు చెందిన భక్తులు హాజరై శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు ముట్టజెప్పుకున్నారు. జాతరకు హాజరైన భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సత్రం ఏర్పాటు చేశారు.

'పార్లమెంటు ఎన్నికల్లో లక్ష ఓట్లు టార్గెట్'



బీజేపిలో చేరుతున్న వివిధ పార్టీల నేతలు

పెద్దబజార్, ఫిబ్రవరి 21:గత పదేళ్ల నుంచి నరేంద్రమోదీ అవినీతి లేని పాలనను అందించారని, మేధావులు, విద్యావంతులు అందరు అన్ని పార్టీ నాయకులు పార్టీలకు అతీతంగా కేంద్రంలో బీజేపీ రావాలని ఔర్‌ఏక్ బార్ మోదీ సర్కార్‌ను కోరుకుంటున్నారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణలు అన్నారు. నగరంలోని ఆరో డివిజన్‌లో 50మంది వివిధ పార్టీల నేతలు బుధవారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అభివృద్ధి దేశ రక్షణ కేవలం బీజేపీతోనే సాధ్యమని నమ్మి చిట్టచివరి పేదోనికి ప్రభుత్వ ఫలాలు అందాలంటే సబ్‌కాసాథ్ సబ్‌కా వికాస్ కేవలం బీజేపీతోనే సాధ్యమవుతోందన్నారు. పార్టీలో చేరిన వారందరికి పార్టీ కండువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు బైకాన్‌మధు, మల్లేష్‌యాదవ్, సుధీర్, ఆకుల శ్రీనివాస్, నారాయణ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.





నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం



మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

- హాజరుకానున్న ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా
- ఈ పాలకవర్గానికి ఇదే చివరి బడ్జెట్
- బడ్జెట్‌పై చర్చ సాగేనా ?

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 21 : నగర మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం గురువారం జరగనుంది.నగరమేయర్ దండు నీతి కిరణ్ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. నగరంలోని నూతన మున్సిపల్ కార్పొరేషన్ భవన సమావేశ మందిరంలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ పాలకవర్గానికి ఇదే చివరి బడ్జెట్ సమావేశం కానుంది. మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ పార్టీల కార్పొరేటర్లు ఇతర పార్టీలలోకి వెళ్లడంతో బడ్జెట్ సమావేశం ఆసక్తికరంగా మారనుంది. ఇన్ని రోజులుగా పెద్ద ప్రతిపక్షం లేకుండా సాగిన సమావేశాలకు ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీల్లో కార్పొరేటర్లు ఎక్కువగా చేరడంతో బడ్జెట్‌పై సమావేశం ఆసక్తికరంగా నెలకొంది.

● 2024 -25కు 274 కోట్లు 89 టార్గెట్

2024-25 సంవత్సరానికి గాను మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ సంవత్సరానికి గాను 274 కోట్లు 89 లక్షల టార్గెట్ విధించుకుంది. రూ.90 కోట్ల 10 లక్షలు మున్సిపల్ ఆదాయం ద్వారా రాగ డిపాజిట్‌ల ద్వారా ఏడు కోట్ల 20 లక్షల బడ్జెట్‌లో ప్రవేశ పెట్టనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాండ్ ధర రూ.17 కోట్ల 60 లక్షలు మొత్తంగా రూ.274 కోట్ల 89 లక్షలుగా ఉంది. సంవత్సరం రూ.272 కోట్లు 72 లక్షలుగా ఉండగా ప్రస్తుతం రెండు కోట్లపైగా బడ్జెట్ పెరిగింది.

● హాజరుకానున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

నిజామాబాద్ నగర చివరి మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన మహేష్‌కుమార్‌గౌడ్ హాజరుకానున్నారు. అంతే కాకుండా ఎమ్మెల్యేగా ఎన్నికైన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త బడ్జెట్ సమావేశంలో పాల్గొనున్నారు.

ప్రజల కోసం పని చేయడం నా జీవిత ఆశయం

● ఎమ్మెల్యే పోచారం

వర్నీ,ఫిబ్రవరి21: ప్రజల కోసం నిరంతరం పని చేయడమే తన జీవిత ఆశయమని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం వర్నీ మండల కేంద్రంలో ఉమ్మడి వర్నీ మండలంలోని 160మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. తాను చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు తిరిగి తనను ఎన్నుకున్నారని అందుకు వారికి రుణపడి ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ మోతిసింగ్, నియోజకవర్గ బాధ్యులు సురేందర్ రెడ్డి, సింగంపల్లి గంగారాం, గిరి, జడ్పీటీసీ హరిదాస్, వైస్ ఎంపీపీ బాలరాజు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు దుస్తుల పంపిణీ

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 21 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బుధవారం కామారెడ్డి పట్టణానికి చెందిన శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో సుమారు లక్ష రూపాయల వ్యయంతో విద్యార్థినులకు దుస్తులను, స్కూల్ బ్యాగ్‌లను, వాటర్ బాటిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 235మంది విద్యార్థినులకు సివిల్ డ్రెస్సులు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేయగా, ఇదే పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థినులకు సివిల్ డ్రెస్సులు, వాటర్ బాటిళ్లతో పాటు స్కూల్ బ్యాగులను సైతం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వీణ, శ్రీరామ సేవా సమితి సభ్యులు గందె నర్సింలు, ఉప్పల గిరిధర్, బుచ్చయ్య, సునీల్, వెంకటేశం, గంగాధర్, పాఠశాల ఉపాధ్యాయినులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో శ్రీగిరి గుట్టపై మహాయజ్ఞం

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 21: మండల కేంద్రం శివారులోని శ్రీగిరి గుట్టపై సతీ సమేతంగా కొలువుదీరిన కాలజ్ఞాని శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి జాతరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం మహాయజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గ్రామాభివృద్ధి, ఆలయ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో శనివారం జరుగనున్న జాతరా ఉత్సవాలు నిర్వహణ నిమిత్తం ఆలయ అర్చకులు నూనె అనిల్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, మహాయజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు దంపతులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అంగిరేకుల మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు గండికోట సాయిరాం, కార్యదర్శి అంకిత్, కోశాధికారి కుమ్మరి భూమేశ్వర్, పాలక వర్గసభ్యులు మైలారం మధుకర్, రాజేష్, శివ, నాగరాజు రాజు, కొత్తపల్లి చందు గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు. జాతరా సందర్భంగా ఆలయంవద్ద ప్రతి రోజు భజన కార్యక్రమాలు జరుగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

మున్సిపల్ వాహనాల కొనుగోళ్లపై విచారణ జరపాలి

ఖిల్లా, ఫిబ్రవరి 21:మున్సిపల్ కార్పొరేషన్ వాహనాలు, పనిముట్ల కొనుగోళ్లపై విచారణ జరుపాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ శాఖలో రూ.5వేల కోట్ల అవినీతి జరిగినట్లు వార్తలు వస్తున్నాయన్నారు. అందులో భాగంగానే నగరపాలక సంస్థలో 2017నుంచి కొనుగోలు చేసిన వాహనాలు, పనిముట్లపై వివిధ అభివృద్ధి పనులపేరుతో జరిగిన పనులపై విచారణ జరిపి సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. సిబ్బందికి అందించే పనిముట్లు నాసిరకం ఉన్నాయని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, జిల్లా కన్వీనర్ కే.మధు, నగర అధ్యక్షుడు ఎం.అజయ్, తిట్టేరాజు, గీతాంజలి, దండుజ్యోతి పాల్గొన్నారు.

పీజీ,ఇంటిగ్రేటెడ్ పరీక్షలు ప్రారంభం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 21: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల పీజీ 1వ సెమిస్టర్ ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంసీఏ, 5ఏళ్ల ఇంటిగ్రెటెడ్ ఏపీఈ, ఐపీసీహెచ్ , ఐఎంబీఏ, 7వ సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. వర్సిటీలోని సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని రిజిస్ట్రార్‌యాదగిరి పరిశీలించారు.ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ఉదయం జరిగిన పరీక్షలకు 1911మంది విద్యార్థులకు గాను 1820 మంది హాజరయ్యారని, 91మంది గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు.

మద్యం పట్టివేత

రెంజల్,ఫిబ్రవరి21: మండలంలోని కందకుర్తి వద్ద మద్యం తరలిస్తున్న తాడ్‌బిలోలికి చెందిన గురడి మహిపాల్ రెడ్డి అనే వ్యక్తి వద్ద 8బాటిళ్ల(16లీటర్ల) మద్యం సీసాలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. మద్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసుకుని బోధన్‌కు తరలించినట్లు ఎక్సైజ్ అధికారులు

కోటగిరిలో ఘనంగా డీఐఈవోకు ఘన సన్మానం

కోటగిరి,ఫిబ్రవరి21: కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ఇంటర్మీడియట్ జిల్లా అధికారి రఘురాజ్ పదవి విరమణను పురస్కరించుకుని బుధవారం కళాశాలలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డీఐఈవోను లెక్చరర్లు ఘనంగా సన్మానించారు. కాలేజ్ డే వేడుకలను సైతం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన పలువురికి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డీఐఈవో రఘురాజ్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, వర్ని ప్రిన్సిపాల్ రవికుమార్, చిరంజీవి, రజియొద్దీన్, దేవురాం, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల శిక్షణ పునాదిరాయి లాంటిది

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 21: పోలీస్ కానిస్టేబుల్ గా శిక్షణ పొందుతున్న వారందరు శిక్షణలో నేర్చే విషయాలు ఉద్యోగ రీత్యా ఎంతో పనిచేస్తాయని శిక్షణ పునాది రాయి లాంటిందని కామారెడ్డి జిల్లా ఎస్పీ సీహెచ్ సింధు శర్మ అన్నారు. బుధవారం ఎస్‌సీటీపీసీఎస్‌ఎఆర్ సైబరాబాద్ 2024 బ్యాచ్‌కు 9నెలల పాటు శిక్షణ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సింధు శర్మ మాట్లాడుతూ.. శిక్షణ లో నేర్చే విషయాలు మెలుకవలు ఉద్యోగంలో ఎంతో తోడ్పాటు అందిస్తాయని పోలీస్ విధి బాధ్యతయుతమైనదని, ఈ వృత్తిని ఎంచుకున్న ప్రతి జవాను కు అభినందనలు తెలిపారు. పోలీసింగ్ వ్యవస్థలో దారి దోపిడిలను మొదలుకొని సైబర్‌క్రైం వరకు జరుగుతున్న మార్పులకు అనుగుణంగా పోలీస్ వ్యవస్థలో కూడా మార్పులు జరుగుతునయన్నారు. ప్రస్తుతం 7వ బెటాలియన్‌లో 13 వ బ్యాచ్ కు ట్రైనింగ్ సెంటర్ లలో 278మంది ఎస్‌సీటీపీఎస్‌లకు శిక్షణ అందిస్తున్నమని కమాండెంట్ రామ్ ప్రకాశ్ తెలిపారు. ఇందుకోసం అనుభవజులైన 36మంది శిక్షకులు వారికి ట్రైనింగ్ ఇస్తారని నిత్యం శిక్షణ ఇచ్చి రాబోవు కాలంలో ఏలాంటి పరిస్థితులు ఎదుర్కొనేల మంచి రక్షక భటు లుగా తయారు చే స్తామన్నారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఆంజనేయ రెడ్డి, భాస్కరరావు, ఏవో హంస రాణి, యూఎంవోఅనుపమ, ఆర్ఐలు వెంకటేశ్వర్లు, నరేష్, ఆర్ ఎస్సైలు, శిక్షణ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కామారెడ్డి ఎస్పీ

సంక్షిప్త సమాచారం

నగరంలో అంతర్గత క్రీడలు ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్‌అర్బన్ , ఫిబ్రవరి 21:జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో అంతర్గత క్రీడలను బుధవారం ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారయణ ప్రారంభించారు. విద్యార్థులు యోగా, కర్రసాము ప్రదర్శించగా ఆయన తిలకించారు. విద్యార్థులు విద్యతో పాటు శారీరక, మానసిక దృఢత్వం పెంపోందించుకోవాలని అన్నారు. ఆడపిల్లల ఆత్మరక్షణకు కర్రసాము లాంటివి నేర్చుకోవాలన్నారు. గిరిరాజ్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామ్మోహన్, పీఈటి బాలమణి, స్థానిక కార్పోరేటర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు శుభాకాంక్షలు



రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ కు శుభాకాంక్షలు తెలుపుతున్న తాహెర్‌బిన్‌హందాన్

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 21:రాష్ట్రవక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా నియమితులైన సయ్యద్ అస్మత్‌ఉల్లాఉసానీని బుధవారం హైదరాబాద్‌లో జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌హందాన్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా ఎన్నికైనందుకు అయనకు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అయన తో పాటు నాయకులు జావెద్‌అక్రం, గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీలకు రావుట్ల విద్యార్థి

సిరికొండ ఫిబ్రవరి 21: జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా సైన్స్ పోటీలో ప్రథమ బహుమతిని అందుకున్న రావుట్ల హైస్కూల్ విద్యార్థిని ఓరుగంటి రాజేశ్వరి రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీలకు ఎంపికయ్యారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన సైన్స్ పోటీలలో సిరికొండ మండలం రావుట్ల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి ఓరుగంటి రాజేశ్వరి ప్రథమ బహుమతిని గెలుచుకుందని ప్రధానోపాధ్యాయడు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా హాజరైన మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ముకరంద విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవ వేడుకలు

బీర్కూర్, ఫిబ్రవరి 21: బీర్కూర్ మండల కేంద్రంలో బుధవారం శ్రీ కోదండ రామాలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఆలయ ప్రధాన పూజారి శేష పంతులు, వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి వేడుకలు ప్రారంభమయ్యాయి. స్వామి వారికి అభిషేకం చేసి పట్టు వస్త్రాలు, బంగారు నగలతో అందంగా అలంకరించారు. వేలాది మంది భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. బీర్కూర్ మండల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కృష్ణుడి గుడి నిర్మాణానికి భూమిపూజ

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 21: నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామంలో బుధవారం కృష్ణుడి గుడి నిర్మాణానికి పీఏసీఎస్ చైర్మన్ పెర్క శ్రీనివాస్ యాదవ్ కులస్తులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవుల కుల దైవం అయిన శ్రీ కృష్ణుడి గుడికి నిర్మాణానికి భూమిపూజ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిరాం యాదవ్, మాజీ ఎంపీటీసీ మహేందర్, బొట్టే రమేష్, మేకల రాములు, ధార లస్మయ్య, ఆనంద్, ధర్మయ్య, కుల స్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 21 :ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో బుధవారం పది లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్డు అవసరమని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే రూ. 10 లక్షలు మంజూరు చేశారని హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్, గురు ప్రతాప్, అజార్ ఖాద్రి, మ హేష్, మల్లయ్య, అహ్మద్,తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

నవీపేట,ఫిబ్రవరి21: నవీపేట రైల్వే స్టేషన్, రైల్వే గేట్‌ల మధ్యన బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందాడని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్ తెలిపారు. మృతుడు 50-55సంవత్సరాల మధ్యన ఉంటాడని, పసుపు రంగు టీషర్టు, నలుపు డబ్బాల ప్యాంటు ధరించి ఉన్నాడని అయన పేర్కొన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై దాడి హేయమైన చర్య

బోధన్ రూరల్, ఫిబ్రవరి 21: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండు రోజుల క్రితం ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్‌పై వైసీపీ నాయకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది హేయమైన చర్య అని బోధన్ తెలుగు యువత ఇంచార్జి ఎత్తొండ రాజేందర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మం గళవారం కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈనాడు కార్యాలయంపై దాడులకు పాల్పడుతూవిలేకరులను భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో వాస్తవాలు రాసే పత్రి కలపై వైసీపీ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని అభి వర్ణించారు. ప్రజాస్వామ్యంలో పత్రిక లకు స్వేచ్ఛ ఉందని, వీటిపై దౌర్జన్యాలకు పాల్పడటం సరికాదన్నారు. ఆంధ్ర ప్రదేశ్ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారంలో వచ్చిన నాటి నుంచి ఆంధ్రజ్యోతి, ఈనాడు రిపోర్టర్లను టార్గెట్ చేయడం, భౌతిక దాడు లకు పాల్ప డటం సరికాద న్నారు. తెలుగుదేశం పార్టీ దీనిని తీవ్రంగా ఖండిస్తుందన్నారు.


కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొస్తున్న ప్రధాన పూజారి కాక సారయ్య


భక్తులతో కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం


జంపన్నవాగు వద్ద యాట మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


జాతరలో జాతకాలు చెబుతున్న కోయదొరలు



జంపన్నవాగులో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు

మేడారం.. జన సంద్రం..

- లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం
- కిటకిటలాడుతున్న జాతర ప్రాంగణం
- సారలమ్మ రాకతో మొదలైన మహాజాతర
- ప్రశాంతంగా ముగిసిన తొలి ఘట్టం


సమ్మక్క గద్దె

మేడారం బృందం, ఫిబ్రవరి 21: జనం.. జనం ప్రభంజనం. ఎటు చూసినా భక్త జన సంద్రం. అన్ని దారులు మేడారం వైపే.. పలు మార్గాల గుండా లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తుతున్నారు. దీంతో బుధవారం రాత్రి వరకు మేడారం పరిసరాలు జనజాతరయ్యాయి. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో సందడిగా మారింది. జాతరకు ఇప్పటికే కోటిమంది వరకు భక్తులు వచ్చినట్టు ప్రాథమిక అంచనా కాగా గురువారం సాయంత్రానికి మరో 50లక్షల మంది వరకు రావొచ్చనని భావిస్తున్నారు. నెలరోజులుగా మేడారానికి వస్తూ ముందస్తు మొక్కులు చెల్లించుకున్న భక్తులు కాక వీరు అదనమని అధికారులు చెబుతున్నారు. ఇక జాతరలో తొలిఘట్టమైన సారలమ్మ రాక.. బుధవారం సాయంత్రం జరగ్గా.. సాయంత్రానికి ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. మేడారంలోకి ప్రవేశించే అన్ని మార్గాల వద్ద మోహరించి.. వాహనాలను నియంత్రిస్తున్నారు. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీలు, కార్లు, ఆటోలు తదితర వాహనాల్లో వస్తుండగా.. డ్యూటీ, ప్రత్యేక పాస్‌లున్న కొన్ని వాహనాలను మాత్రమే మేడారంలోకి అనుమతిస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారంతా మేడారానికి ఐదు కిలో మీటర్ల దూరంలోని పార్కింగ్ ప్రాంతాల నుంచి మూటాముల్లెలతో కాలినడకన గద్దెలకు చేరుకుంటున్నారు.



వనదేవతల రాకతో..

బుధవారం రాత్రి సారలమ్మ రాకతో వనం పులకించిపోయింది. రాత్రి కన్నెపల్లి నుంచి సారలమ్మను ప్రధాన పూజారి కాక సారయ్య జయజయధ్వానాల మధ్య తీసుకొచ్చారు. అలాగే పూనుగొండ్ల నుంచి మంగళవారం బయలుదేరిన పగిడిద్దరాజు బుధవారం మేడారానికి చేరుకున్నారు. కొండాయి నుంచి గోవిందరాజులు, నాగులమ్మ గద్దెలకు చేరుకోవడంతో భక్తుల మొక్కులు ప్రారంభమయ్యాయి.

దూరప్రాంతాల నుంచి..

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జాతర సమయంలోనే సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవాలని తపించే లక్షల మంది మంగళవారం నుంచి మేడారం బాటపట్టారు. వాహనాలు, బస్సులు, ఎడ్ల బండ్లలో తరలివచ్చి మేడారం చుట్టుపక్కల విడిది చేశారు. దీంతో మేడారానికి ఎటు చూసినా 20 కి.మీ. వరకు భక్తుల సందోహమే కనిపిస్తోంది. వనం అంతా జన మైంది.


జంపన్నవాగు నుంచి గద్దెల వద్దకు వచ్చే దారిపై భక్తజనం రద్దీ



నగరంలో సీపీ ఆకస్మిక తనిఖీ


నగరంలో రాత్రి ఆకస్మిక తనిఖీ చేసిన సీపీ

ఖిల్లా, ఫిబ్రవరి 21:పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌శింగనేవార్ మంగళవారం అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూనిఫాం లేకుండా సివిల్ డ్రెస్‌లో ఆయన నగరంలో లాఠీ చేత పట్టుకుని అందరిని ఆశ్చర్యానికి గురి చేశారు. ఆపరేషన్ చబుత్రాలో భాగంగా నగరంలోని ప్రధాన రోడ్లలో అర్ధరాత్రి వేళ సంచరిస్తున్న వాహనదారులను ఆపి వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. నంబర్‌ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేశారు. అనవసరంగా రాత్రి వేళ సంచరిస్తున్న యువకులను ఆయా పోలీసు స్టేషన్‌కు తరలించారు. నంబర్‌ప్లేట్ లేని సుమారు 40కి పైగా వాహనాలను సంబంధిత పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా సీపీ యువకుల వివరాలను నమోదు చేశారు. ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని ఆదేశించారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటి సారి ఆకస్మికంగా సివిల్ డ్రెస్‌లో నగరంలో రాత్రి వేళ ఆకస్మికంగా తనిఖీ చేయడం వల్ల యువకులు ఆందోళన చెందారు.

చిన్నారులకు వాటర్ బాటిళ్ల పంపిణీ

డిచ్‌పల్లి,ఫిబ్రవరి 21: మండల కేంద్రంలోని మానవత సదన్ లో బుధ వారం జైశ్రీరాం స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు దాత శైలజ ఉచితంగా పంపిణీ చేశారు. సదన్ విద్యార్థులకు తమ సంస్థ ఎల్లపుడు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, రామ్‌మోహన్, నగేశ్, సతీశ్, బాలకిష్ట, రాము, కేర్ టేకార్ రమేశ్ పాల్గొన్నారు.

సేవాలాల్ ఆశయాలతో ముందుకు సాగాలి

- ఎన్‌ఎస్‌ఎఫ్ భూములు అక్రమ రిజిస్ట్రేషన్‌లకు పాల్పడితే కఠిన చర్యలు : బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్ రూరల్, ఫిబ్రవరి 21: శ్రీ సద్గురు సేవాలాల్ మహరాజ్ ఆశయాలను అనుసరించి ప్రజలు ముందుకు సాగాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని అప్నా ఫంక్షన్ హాల్‌లో సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన,బంజారాల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళుతుందన్నారు. ప్రజల సహకారంతో తండాల అభివృద్ధికి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. సేవాల్ జయంతి ఉత్సవాల కోసం ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు కోట్ల రూపాయల నిధులు ఇస్తుందన్నారు.బోధన్, ఎడపల్లి, రెంజల్ మండలాల్లోని ఎన్‌ఎస్‌ఎఫ్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్‌లకు పాల్పడితే సిబ్బందిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది అవినీతి,అక్రమాలకు పాల్పడితే ఆర్డీవో,తహసీల్దార్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రజలు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.వెనుకబడిన విద్యార్థులపైఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అన్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత, ఉజ్వల భవిష్యత్‌కు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు.గిరిజన మహిళలతో కలిసి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నృత్యాలు చేశారు. ఈకార్యక్రమంలో బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ శ్రీనివాస్, తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీవో వెంకటేష్‌జాదవ్, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, టీపీసీసీ డెలిగేట్ గంగా శంకర్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, పాషామొ హీనుద్దీన్, అల్లెరమేష్, నాయకులు దూప్‌సింగ్, జాదవ్ ప్రవీణ్ నాయక్, లక్ష్మణ్ చౌహాన్‌లతో బంజారా సేవా సంఘం నాయకులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

● కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక

టీపీసీసీ అధ్యక్షుడు గంగాశంకర్ ఆధ్వర్యంలో బోధన్ మండలంలోని సొసైటీ చైర్మన్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో హున్సా ఎంపీటీసీ శివకుమార్, ఖండ్ గావ్ ఎంపీటీసీ ఉషాబాబురావు, ఊట్‌పల్లి ఎంపీటీసీ పీరుబాయి, పెంటాకలాన్ సొసైటీ చైర్మన్ రాజారెడ్డి, పెగడాపల్లి మాజీ సర్పంచ్ గుండారం శంకర్‌లతో పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో సాలూర కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మందర్నరవి, అల్లె రమేష్, ఖాజాఫూర్ అశోక్ తదితరులు ఉన్నారు.

నవీపేట: మహిళ సంఘాల సభ్యులు బ్యాంకుల ద్వారా పొందిన రుణాలను స్వయం ఉపాధికి వినియోగించి సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలోని రఘుపతిరెడ్డి గార్డెన్స్‌లో నవీపేట, బోధన్ మండలాలకు చెందిన మహిళ సంఘాల సభ్యులకు యూనియన్ బ్యాంక్ ద్వారా ఏర్పాటు చేసిన రుణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు నెలల కాలంలో యువతకు 25వేల ప్రభుత్వ ఉద్యోగాలను అందజేయడం జరిగిందని అన్నారు. తాము ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా త్వరలో మరో రెండు గ్యారెంటీ స్కీమ్‌లను అమలు చేయడం జరుగుతోందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ఖజానను ఖాళీ చేసిందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులలో ఎక్కువ మంది ఫెయిల్ అయితే సంబంధించిన సబ్జెక్టు ఉపాధ్యాయులపై కూడా చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా నవీపేట మండలానికి చెందిన 65మహిళ సంఘాల గ్రూపులకు రూ.8కోట్ల, బోధన్ రూరల్‌కు చెందిన 27మహిళ సంఘాల గ్రూపులకు రూ.3కోట్ల చెక్కును మహిళ సంఘాల సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ డీజీఎం శంకర్ హేమ్‌రామ్, ఏజీఎం, ఏపీడీ , ఐకేపీ డీపీఎం నీలిమా, ఎంపీడీవో నాగనాథ్, ఏపీఎం, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉషారాణి, నవీపేట యూబీఐ మేనేజర్ చంద్రకాంత్, పెద్ద ఎత్తున మహిళ సంఘా సభ్యులు పాల్గొన్నారు. అనంతరం నవీపేటలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గ్రామాల్లో వైన్స్ యజమానుల దోపిడీని అరికట్టాలి

సిరికొండ ఫిబ్రవరి 21: గ్రామాల్లో విచ్చల విడిగా బెల్టు షాపులను పంపిణీ చేసుకుని వైన్స్ యజమానులు చేస్తున్న దోపిడిని అరికట్టాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్. రమేష్ రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులను కోరారు. సిరికొండలో తహసీల్దార్ రవీందర్‌రావుకు సీపీఐఎంఎల్ మాస్‌లైన్ కార్యకర్తలు వినతి పత్రాన్ని అందజేశారు. అ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టు షాపులను పంచుకుని అడ్డగోలు ధరలకు అమ్ముతూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నరని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ బెల్టు షాపులను ఎత్తివేస్తామని ప్రచారం చేసిందని ఆయన గుర్తు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో విచ్చల విడిగా మద్యాన్ని ఏరులై పారుతున్న ముడుపులకు అలవాటు పడిన అబ్కారీ శాఖ అధికారులు బెల్టు షాపులను నిర్వహించుకోవడానికి సహకరించడం విడ్డూరంగా ఉందన్నారు.వైన్స్ యజమానులు అక్రమంగా బెల్టు షాపుల్లో చట్టవ్యతిరేకంగా మద్యం వ్యాపారం చేస్తు ప్రజలను దోపిడి చేస్తున్నారని విమర్శించారు. వైన్స్ యజమానుల దోపిడిని అరికట్టడంతో పాటు చట్ట విరుద్ధంగా గ్రామాల్లో నడుస్తున్న బెల్టు దుకాణాలను మూసి వేయించాలని రమేష్ ఎక్సైజ్ ఉన్నాతాధికారులను రమేష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు దామోదర్, సాయరెడ్డి, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు అనీస్,మండల నాయకులు కిషోర్,గంగాదాస్,సాయిలు, పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

ఆర్టీసీ డ్రైవర్‌పై ప్రయాణికుల దాడి

- రెండు గంటల పాటు బస్సుల నిలిపివేత


ఆర్మూర్‌లో ధర్నా చేస్తున్న ఆర్టీసీ డ్రైవర్‌లు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి21: పట్టణంలోని కొత్తబస్టాండ్‌లో ఆర్టీసీ డ్రైవర్ నర్సయ్యపై ముగ్గురు ప్రయాణికులు దాడి చేశారు. దీంతో ప్రైవేటు బస్సుల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. రెండు గంటల పాటు తమ బస్సులను నిలిపివేశారు. ఆర్మూర్ నుంచి మెట్‌పల్లి వెళ్లే బస్సు ఆర్టీసీ బస్టాండ్ ప్లాట్‌ఫాం వద్ద ఉండగా కండక్టర్ కొరకు డ్రైవర్ నర్సయ్య హరన్ కొట్టాడు. హరన్ ఎందుకు కొడుతున్నవంటు ముగ్గురు ప్రయాణి కులు వచ్చి బూతులు తిడుతూ దాడి చేశారు. దీంతో ప్రైవేటు బస్సు డ్రైవర్లు వారిని అరెస్టు చేయాలని తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరుస్తున్న తమపై ఏదో ఒక చోట ప్రయాణికులు దాడులకు దిగుతున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. దీంతో డ్రైవర్‌పై దాడికి పాల్పడిన వారిపై ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ధర్నాలో ప్రైవేటు బస్సుల అసోసియేషన్ ప్రతినిధులు నర్సయ్య, నవీన్, శ్రీనివాస్, డ్రైవర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా సీతారాముల కల్యాణం


పూజ నిర్వహిస్తున్న పురోహితులు

డిచ్‌పల్లి,ఫిబ్రవరి 21:జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన ఖిల్లా డిచ్‌పల్లి రామాయలం సీతారాముల కల్యాణోత్సవం బుధవారం నిర్వహించారు. సీతారామ రామచంద్రమూర్తి కల్యాణోత్సవ వేడుకలను భక్తులు భారీగా తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. మాఘశుద్ధ ద్వాదశి బుధవారం రోజున స్వామి వారి కల్యాణం నిర్వహించడం ఆనవాయతీగా వస్తోంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, తాళిబొట్టు ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్ గుప్తా సమర్పించారు. ఆలయప్రధాన అర్చకుడు సుమిత్‌శర్మ దేశ్‌పాండే, ఆధ్వర్యంలో ఈ పూజలునిర్వహించారు.ఈకార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, మాజీ సర్పంచ్‌లు గడ్డం రాధ కిష్టారెడ్డి,విండో మాజీ చైర్మన్, గ్రామస్థులు, పాల్గొన్నారు.

సీవోఈ హాల్ టికెట్లు విడుదల

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 21: సీవోఈ మొదటి ప్రవేశ పరీక్షలో క్వాలిఫై అయిన విద్యార్థులు రెండో లెవల్‌కు సంబంధించిన హాల్ టికెట్లు వెబ్‌సైట్ ద్వార డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ సంగీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష ఈ నెల 25న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు డిస్క్రిప్షన్ పద్ధతిలో ఉంటుందన్నారు. అభ్యర్థులు బ్లూ లేదా బ్లాక్ పెన్ను తెచ్చుకున్నారు. పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు.